

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘాల సమాఖ్య నాయకుడు తులసి శ్రీనివాస్ బృందం ఆదివారం ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలువురు తెలంగాణ, గ్రేటర్ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నట్లు వెల్లడించారు. అనంతరం వేదపండితులు సన్నిధానం శ్రీధర్‌శర్మ బృందం సీఎంకు ఆశీర్వచనం చేసి, పట్టువస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల ప్రముఖులు వారణాసి వంశీ, వక్కలంక శ్రీనివాస్, నందిరాజ్ లక్ష్మీనారాయణ, మంగు రాఘవరావు, మంగపతిరావు, మంతశాస్త్రి, వడ్లమాని మమత, అనురాధ, ఉప్పల్ వైఎస్పార్, బాల శ్రీనివాస్, ఎంవీ శాస్త్రి, మధుమోహన్, ఎస్టీ చారి, యాదగిరిరావు, అరుణ, వక్కలంక స్వరూప్‌రాజ్, మురళీకృష్ణ, ఫణి పాల్గొన్నారు. - దిల్‌సుఖ్‌నగర్, ఆంధ్రజ్యోతి



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బలాల

అసదుద్దీన్ ఒవైసీని మరోసారి గెలిపించండి: బలాల

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పనిచేసే అసదుద్దీన్ ఒవైసీని హైదరాబాద్ ఎంఐఎం ఎంపీగా మరోసారి గెలిపించాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సాయంత్రం చావునీ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో హైదరాబాద్ ఎంఐఎం ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి మద్దతుగా చావునీ డివిజన్‌లోని సుల్తాన్ దహరా, కుర్మగూడ తదితర ప్రాంతాల్లో ఆయన ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ఎంఐఎంకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎంఐఎంకు హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో మంచి ఆదరణ ఉందని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తూ ప్రజలకు మరింత చేరువవుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో చావునీ కార్పొరేటర్ సలాం షాహిద్‌మూన్, మాజీ కార్పొరేటర్ ముర్తుజాఅలీ, ఎంఐఎం నాయకులు సయ్యద్ అలీం, అబ్రార్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కౌన్సిలర్ రవీందర్‌రెడ్డి

కాంగ్రెస్‌లో చేరిన ఇంజాపూర్ కౌన్సిలర్

హయత్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, ఇంజాపూర్ కౌన్సిలర్ బొక్క రవీందర్ రెడ్డి ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు కౌశిక ఐలయ్య, కుంట గోపాల్‌రెడ్డి, పిట్ట సుదర్శన్‌రెడ్డి, కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, కమల్‌రెడ్డి, కృష్ణచారి పాల్గొన్నారు.

హైదరాబాద్ ఎంపీగా మాధవీలతను గెలిపించాలి



ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలతకు మద్దతుగా మూసారాం బాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి ఆదివారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లోని బూత్ నంబరు 240, 241 పరిధిలో ఇంటింటికీ వెళ్లి మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తించి హైదరాబాద్ ఎంపీగా మాధవీలతను గెలిపించాలని ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 240వ బూత్ కమిటీ అధ్యక్షుడు శివ, 241వ బూత్ కమిటీ అధ్యక్షుడు సంతోష్, కోఆర్డినేటర్లు కిరణ్, శశికాంత్ బూత్ కమిటీ సభ్యులు రవి, హేమంత్, విశాల్, రాజు, దినేష్ మల్లేష్ పాల్గొన్నారు.

తెలంగాణ జాగీరు పార్టీ ఎంపీ అభ్యర్థుల ప్రకటన



తెలంగాణ జాగీరు పార్టీ నుంచి పోటి చేయనున్న ఎంపీ అభ్యర్థులు

హయత్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగీరు పార్టీ నుంచి పోటీ చేయనున్న ఏడుగురు ఎంపీ అభ్యర్థులను ఆదివారం తుర్కయంజాల్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జి. జయరాజ్ ప్రకటించి బీ ఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు తెలంగాణ జాగీరు పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి అంజనేయచారి, హైదరాబాద్ నుంచి సిలివేరు నరేష్, మహబుబాబాద్ నుంచి వి. రవికుమార్, చేవెళ్ల నుంచి కె. సూర్యప్రకాష్, నల్లగొండ నుంచి బి. శంకర్, మహబూబునగర్ నుంచి ఎన్. నరేష్‌రెడ్డి, భువనగిరి నుంచి బి. బాలబ్రహ్మచారి పోటీ చేస్తున్నట్లు జయరాజ్ ప్రకటించి బీఫాంలను అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి: నర్సింహారెడ్డి



సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్

వనస్థలిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్‌లోని జడ్జెస్ కాలనీ ఫేజ్-1, వివేకానందనగర్ కాలనీలో ఆదివారం మార్నింగ్ వాక్ చేపట్టి కాలనీవాసుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు షణ్ముకచారి, చెన్నయ్య, సుకుమార్, మాధవరెడ్డి, సుదర్శన్‌రావు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ఉత్సవాలు ప్రారంభం

సైదాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ జైలుగార్డెన్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ 52వ జయంతోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో మొదటి రోజు ఆదివారం ఉదయం అభిషేకాలు, ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠ, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కె.జయప్రకాశ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు ఉమాశంకర్, కోశాధికారి శ్యాంసుందర్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు.

23న హనుమాన్ జయంతి, శోభాయాత్ర



హనుమాన్ జయంతి, శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యశ్పాల్‌గౌడ్

కొత్తపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేట మోహన్‌నగర్‌లో హనుమాన్ జయంతి, శోభాయాత్ర వేడుకలను ఈనెల 23న నిర్వహించనున్నట్లు హనుమాన్ యువసేన అధ్యక్షుడు బోల్లం యశ్పాల్‌గౌడ్ తెలిపారు. మోహన్‌నగర్ బీజేపీ కార్యాలయంలో ఆదివారం శోభాయాత్ర పోస్టర్‌ను యశ్పాల్‌గౌడ్ ఆవిష్కరించి మాట్లాడారు. 23న సాయంత్రం 5గంటలకు అంజనేయస్వామికి ప్రత్యేక పూజల అనంతరం 6గంటలకు శోభాయాత్ర చేపడతామన్నారు. మోహన్‌నగర్, బాలాజీనగర్, సీటీఓకాలనీ, కొత్తపేట, ఓల్డ్ మారుతీనగర్ చౌరస్తా, జైన్‌మందిర్, ఆంజనేయస్వామి ఆలయం, చైతన్యపురి రామాలయం వరకు శోభాయాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు. శోభాయాత్రలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. హనుమాన్ యువసేన ప్రతినిధులు కిరణ్‌కుమార్, తరుణ్, సంపత్, వెంకటేశ్, విష్ణు, వినోద్, అభినవ్ పాల్గొన్నారు.

డేంజర్ స్పాట్..

గుర్రంగూడ యూ టర్న్..!

- తరచూ ఘోర ప్రమాదాలు.. గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- మూల మలుపు వద్ద యూ టర్న్ ఉండడమే కారణం
- జీబ్రా క్రాసింగ్స్, బారికేడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్
- యూ టర్న్‌ను స్ట్రెయిట్ రోడ్డుకు మార్చాలని వినతి



ఇటీవల గుర్రంగూడ యూ టర్న్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు నుజ్జునుజ్జు అయిన దృశ్యం

సరూర్‌నగర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హైవేలోని గుర్రంగూడ బస్టాప్ వద్ద ఉన్న యూ టర్న్ ఓ 'డేంజర్ స్పాట్'గా మారింది. బీఎన్‌రెడ్డినగర్, సాగర్ కాంప్లెక్స్ నుంచి వేగంగా దూసుకు వస్తున్న వాహనాలు ఇక్కడి మూలమలుపు వద్ద ఉన్న యూ టర్న్‌ను గమనించకుండా వేగంగా వచ్చి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వాస్తవానికి ప్రధాన చౌరస్తాల్లో వాహనాల రద్దీ తగ్గించాలనే ఉద్దేశంతో జంక్షన్లు మూసేసి ఏర్పాటు చేసే యూ టర్న్‌లు చౌరస్తాకు రెండు వైపులా దాదాపు సమాన దూరంలో ఉండాలి. కానీ ఇక్కడ మాత్రం ట్రాఫిక్ పోలీసులు, సివిల్ పోలీసులు అసంబద్ధ నిర్ణయం తీసుకుని ఓ వైపు కిలోమీటర్ దూరంలో, మరో వైపు పర్లాంగు దూరంలో యూ టర్న్‌లు ఏర్పాటు చేయడం గమనార్హం! ఇలా పర్లాంగు దూరంలో ఏర్పాటు చేసిన యూ టర్న్ వద్దే నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తక్కువ దూరంలో యూ టర్న్ ఉండడంతో ఇక్కడ రాంగ్‌రూట్‌లో వచ్చే వాహనాలు సైతం ప్రమాదాలకు మరో కారణంగా నిలుస్తున్నాయి.

రెండు నిండు ప్రాణాలు బలి

ఇటీవల(ఈ నెల మొదటి వారంలో) గుర్రంగూడలోని విపశ్యన మెడిటేషన్ సెంటర్ చౌరస్తాలోని యూ టర్న్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం పాలైన సంగతి తెలిసిందే. తుర్కయంజాల్ వైపు నుంచి ఓ కారులో ఇద్దరు యువకులు వస్తుండగా, బీఎన్‌రెడ్డినగర్ వైపు నుంచి మరో కారులో వచ్చిన వాహనదారుడు గుర్రంగూడ మలుపు వద్ద వేగంగా దూసుకువచ్చి సదరు యూటర్న్ వద్ద నియంత్రణ కోల్పోయి నేరుగా వెళ్లి ఎదురుగా వస్తున్న యువకుల వాహనాన్ని ఢీకొట్టాడు. దాంతో రెండు కార్లు నుజ్జునుజ్జయ్యాయి, ఎదుటి కారులో ఉన్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మరో కారులోని ప్రయాణికుడు సైతం తీవ్రగాయాలతో ఆస్పత్రిపాలయ్యాడు. ఈ ఘోర ప్రమాదానికి.. మూలమలుపు వద్ద ఏర్పాటు చేసిన యూ టర్నే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైగా ఈ యూ టర్న్ గుర్రంగూడ బస్టాపుకు దగ్గరగా ఉండడం.. అటు వైపు(బీఎన్‌రెడ్డినగర్ వైపు) యూ టర్న్ కిలోమీటర్ దూరంలో ఏర్పాటు చేయడంతో వాహనదారులు అటు వెళ్లకుండా ఇటు రాంగ్‌రూట్‌లో వస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ దృష్ట్యా ఇక్కడి మూల మలుపు వద్ద ఉన్న యూ టర్న్‌ను ఇంకాస్త దూరంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆరెంజ్ కలర్ స్వాగత తోరణాల వద్ద ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అదేవిధంగా బీఎన్‌రెడ్డినగర్ వైపు కిలోమీటర్ దూరంలో ఉన్న యూ టర్న్‌ను సైతం ఫ్లైటెక్ ఏవియేషన్ చౌరస్తా నుంచి మార్చి హరితపురి కాలనీ సమీపంలో ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.



నిత్యం ప్రమాదాలకు కారణమవుతున్న గుర్రంగూడ యూ టర్న్ ఇదే

జీబ్రా లైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలి



గుర్రంగూడ చౌరస్తా వద్ద జంక్షన్ మూసేయడంతో ఇరువైపులా నుంచి వాహనాలు వేగంగా దూసుకువస్తున్నాయి. దాంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ దృష్ట్యా చౌరస్తా వద్ద జీబ్రా క్రాసింగ్‌లు, బారికేడ్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నది. చౌరస్తాకు ఇరువైపులా ఏర్పాటు చేసిన యూ టర్న్‌లు రెండూ సమాన దూరంలో ఉండేలా చర్యలు తీసుకోవాలి. తద్వారా వాహనాలు రాంగ్‌రూట్‌లో వెళ్లడాన్ని అరికట్టవచ్చు. యూ టర్న్‌ల వద్ద కూడా ప్రమాదాల నియంత్రణ కోసం జీబ్రా క్రాసింగ్‌లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలి. గుర్రంగూడ వద్ద పాదచారుల వంతెన నిర్మాణంపై అధికారులు దృష్టి సారించాలి.

-బి. నరేందర్‌గౌడ్, అడ్వకేట్, గుర్రంగూడ

కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్, మల్‌రెడ్డి రాంరెడ్డి

చంపాపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఓటర్లను కోరారు. చంపాపేట డివిజన్‌లోని సాయిరాంనగర్‌కాలనీలోని గణేష్‌పార్కులో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మార్నింగ్ వాకర్స్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాలనీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో మోదీకి భంగ పాటు తప్పదని, కేంద్రంలో ఇండియా కూటమి అధికారం చేపట్టనుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ముద్దగొని రామ్మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యుడు వెంకట్‌యాదవ్, నాయకులు రఘునందన్‌రెడ్డి, గ్యారగోని ప్రవీణ్‌గౌడ్, సామ రంగారెడ్డి, జిట్టా సురేందర్‌రెడ్డి, సుర్వీ పెంటయ్యగౌడ్, శ్రీధర్‌రెడ్డి, గౌతంరెడ్డి, రమాకాంత్ గుప్తా, తోకటి కిరణ్, అనసూయ, రవీందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

చంపాపేట డివిజన్ మారుతీనగర్‌కాలనీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముత్యాల సత్యనారాయణ ఆదివారం కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మల్కాజిగిరిపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

వనస్థలిపురం: పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీ స్థానంపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముద్దగొని రామ్మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఎన్‌రెడ్డినగర్‌లోని తన నివాసంలో ఆదివారం ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిలు హాజరై నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో పట్నం సునీతామహేందర్‌రెడ్డికి ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగొని లక్ష్మీప్రసన్నరామ్మోహన్‌గౌడ్, సరస్వతి, జోగు రాములు, సంతోష్‌గౌడ్, జూపల్లి అంజయ్య, రషీద్, మౌలానా బాష, రాజుగౌడ్, రంజిత్ గౌడ్, మనీష్‌గౌడ్ పాల్గొన్నారు.

మతవిద్వేషాలు రెచ్చగొట్టే వారికి తగిన బుద్ధి చెప్పాలి: మధుయాష్కీ

వనస్థలిపురం : దేశంలోని అన్ని వర్గాల మధ్య మతసామరస్యం, స్వేచ్ఛ, సమానత్వం కొనసాగించడమే కాంగ్రెస్ విధానమని, వాటిని రక్షించుకోవాలన్న ప్రధాన ఎజెండాతో పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిలతో కలిసి మధుయాష్కీ గౌడ్ వనస్థలిపురంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ నేటికి దేశంలోని పలు ప్రాంతాల్లో మైనార్టీలపై దాడులు జరగడం బాధాకరం అన్నారు. మతవిద్వేషాలు రెచ్చగొట్టే వారికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీగా పట్నం సునీతామహేందర్‌రెడ్డిని కులమతాలకు అతీతంగా ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ముద్దగొని రామ్మోహన్‌గౌడ్, వజీర్ ప్రకాశ్‌గౌడ్, గజ్జి భాస్కర్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న, డివిజన్ అధ్యక్షులు కుట్ల నర్సింహయాదవ్, మకుటం సదాశివుడు, కిషోర్‌గౌడ్, శాలిని, స్వర్ణమాధవి, రామారావు, సుజాత పాల్గొన్నారు.



మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరుతూ ఆదివారం హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో హయత్‌నగర్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కళ్లెం రవీందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఉగాది ఎల్లప్పతో పాటు పలువురు పాల్గొన్నారు. - హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి

చేవెళ్లలో ఎగిరేది కాషాయ జెండానే: చెరుకుపల్లి

సరూర్‌నగర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో ఎగిరేది కాషాయ జెండాయేనని బీజేపీ బడంగ్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం బాలాపూర్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శి జోరల ప్రభాకర్ ఆధ్వర్యంలో నాలుగు డివిజన్లకు చెందిన పోలింగ్ బూత్‌ల అధ్యక్షులు, కోఆర్డినేటర్లు, ఏజెంట్లు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయిలో గట్టి పునాది ఉంటేనే పార్టీ బలంగా నిలువగలుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి బీజేపీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొలన్ శంకర్‌రెడ్డి, గడ్డం వెంకటేశ్, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కొంతం ప్రకాశ్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, రావుల మల్లేశ్, నవారు శ్రీనివాస్‌రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, పన్నాల భార్గవరెడ్డి పాల్గొన్నారు.



బాగ్ హయత్‌నగర్ మాదిగ సంఘం కార్యవర్గం

బాగ్ హయత్‌నగర్ మాదిగ సంఘం కార్యవర్గం ఎన్నిక

హయత్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బాగ్ హయత్‌నగర్ బృందావన్‌నగర్ కాలనీలో పోచమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాదిగ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాగ్ హయత్‌నగర్ మాదిగ సంఘం నూతన అధ్యక్షుడిగా చింతపట్ల బాబురావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా క్యాదాసు సుధాకర్, సంయుక్త కార్యదర్శిగా పారంద సాయి, ఉపాధ్యక్షులుగా బట్టీల మహేందర్, సుంచు కుమార్, పారంద దశరథ, సుక్క వెంకటేశ్, క్యాదాసు జగన్‌మోహన్, ఎర్ర ప్రేం, పారంద అరవింద్, కోశాధికారిగా ఎర్ర మహేందర్, సహాయ కోశాధికారిగా పారంద యాదగిరి, కార్యనిర్వాహకులుగా యాదగిరి, హరీష్, సతీష్, గడ్డం అర్జున్, బాబు, భరత్, కిషన్‌బాబు, హరికృష్ణ, సాంస్కృతిక కార్యదర్శులుగా శ్రీను, రమేశ్, మేడి రమేశ్, ఎర్ర శ్రీను, జగదీష్, బట్టీల కుమార్, మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సినీ రంగంలో ప్రవేశానికి ఉచిత శిక్షణ

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సినీ రంగంలో రాణించాలనుకున్న ఔత్సాహిక యువతీ, యువకులకు మే 5వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు దిల్‌సుఖ్‌నగర్‌లోని ఫోర్త్ వాల్స్ థియేటర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఫోర్త్ వాల్ థియేటర్ వ్యవస్థాపకుడు, ఫిలిం డైరెక్టర్ నల్ల అమరేందర్ తెలిపారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నటించాలనే తపన, దర్శకత్వం, స్క్రిప్ట్ రైటింగ్, కథ, మాటలు రాయాలన్న ఆసక్తి ఉన్న వారికి సినీ రంగంలో అనుభవజ్ఞులైన వారిచే శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. ఆదరణ లేక ఎంతో మంది ప్రతిభ కలిగిన వారు ముందుకు సాగలేక పోతున్నారన్నారు. రంగస్థలంలో నటన, దర్శకత్వం, యాంకరింగ్‌లో కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. 15ఏళ్ల వయస్సు నుంచి 50ఏళ్ల వయస్సు వారు ఈ ఉచిత శిక్షణకు అర్హులన్నారు. ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో మే 5వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 7306475283, 9959413277 ద్వారా కానీ, శాలివాహననగర్ కాలనీ స్ట్రీట్ నంబర్ 2లో గల ఫోర్త్ వాల్ థియేటర్‌లో స్వయంగా కూడా సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

ప్రజాసంక్షేమ పాలన కాంగ్రెస్‌కే సాధ్యం: రంజిత్‌రెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, అనితారెడ్డి తదితరులు

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమ పాలన కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రంజిత్‌రెడ్డి ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్, రాజీవ్‌గాంధీ చౌరస్తా, టెలిఫోన్‌కాలనీ చౌరస్తాలలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలలో 99శాతం అమలు చేసిందన్నారు. దేశం సుభిక్షంగా ఉండాలంటే ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని ఆయన కోరారు. కాంగ్రెస్ హస్తం ప్రజల నేస్తమన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, కాంగ్రెస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, ఎన్నికల ఇన్‌చార్జి నిజాముద్దీన్, నేరెళ్ల శారద, అమరేందర్‌రెడ్డి, రమేష్‌నేత, గట్ల రవీంద్ర, యాదయ్య, లింగస్వామిగౌడ్, జ్ఞానేశ్వర్‌యాదవ్, రాజునాయక్, శేఖర్, శ్రీశైలం, అక్బర్, కల్యాణ్, పురుషోత్తం, సుజాతరెడ్డి, మాధవి, లక్ష్మి, రేణుక, శైలజారెడ్డి పాల్గొన్నారు.

ప్రజారంజకంగా రేవంత్ పాలన

- చేవెళ్లలో కాంగ్రెస్‌దే విజయం
- మేయర్ పారిజాతారెడ్డి ధీమా

సరూర్‌నగర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజారంజక పాలన కొనసాగుతున్నదని, ప్రజలంతా కాంగ్రెస్ పాలనపై పూర్తి సంతృప్తిగా ఉన్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం ఆమె బడంగ్‌పేట్ కార్పొరేషన్ 31వ డివిజన్‌లోని లక్ష్మీనగర్, గ్రీన్‌రిచ్ కాలనీ, బాలాజీకాలనీల్లో పర్యటించి, చేవెళ్లలో కాంగ్రెస్ తరఫున ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి పార్టీ సంక్షేమ, అభివృద్ధి పథకాలతో కూడిన కరపత్రాలను స్థానికులకు అందజేసి కాంగ్రెస్‌కు ఓటేయాలని కోరారు. అనంతరం ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పారిజాతారెడ్డి మాట్లాడుతూ చేవెళ్లలో కాంగ్రెస్ అభ్యర్థి ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్‌కు మూడో స్థానం తప్పదని, ఇక బీజేపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఆమె వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తేనే అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, బండ్లగూడ ఖల్సా రైతు సొసైటీ వైస్ చైర్మన్ కొలన్ తిరుపతిరెడ్డి, బడంగ్‌పేట్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, కాంగ్రెస్ బడంగ్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ నాయకులు భీమిడి చంద్రపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గిరిముదిరాజ్, రాకేశ్ పాల్గొన్నారు.



రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి తదితరులు

గుర్రంగూడ చర్చిలో చల్లా ప్రార్థనలు

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని కోరుతూ ఆదివారం గుర్రంగూడలోని నిట్టూరి ఏసురత్నం చర్చిలో రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేవెళ్లలో రంజిత్‌రెడ్డి గెలవాలని, దేశానికి రాహుల్ ప్రధాని కావాలని ఏసును వేడుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు గుర్రం లక్ష్మీనరసమ్మ, చర్చి నిర్వాహకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కార్మికులను ఏకం చేసిన సంఘం ఏఐటీయూసీ

- జిల్లా అధ్యక్షుడు పానగంటి పర్వతాలు



మాట్లాడుతున్న పర్వతాలు

హయత్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ హయత్‌నగర్ మండల సమితి నిర్మాణ మహాసభ ఆదివారం హయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పానగంటి పర్వతాలు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం కార్మికులను ఏకంచేసి పోరాటాలు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సబ్ కమిటీ సభ్యుడు సామిడి శేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు హరిసింగ్‌నాయక్, నాయకులు కృష్ణ, నాగరాజు, శ్రీధర్‌రెడ్డి, జానీ, సురేందర్, సౌజన్య, స్వరూప, చంటి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.